క్లుప్తంగా

మహిళపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: అపార్టుమెంట్‌లో మహిళపై మరో మహిళ దాడి చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి మధురం టవర్స్‌కు చెందిన అనుమోలు లక్ష్మీకుమారి భర్త అనుమోలు వెంకటేశ్వరరావుతో ఉంటుంది. అయితే లక్ష్మీకుమారి పెనమలూరులో అపార్టుమెంట్ కొని పనులు చేయిస్తోంది. అయితే ల్యాండ్ ఓనర్ టి.హేమ పనులు చేసుకోకుండా అడ్డుతగులుతూ ఇబ్బంది పెట్టసాగాంది. ఈ నేపథ్యంలో లక్ష్మీకుమారి పనులు చేస్తుంటే హేమ, మరో ముగ్గురు వచ్చి ఆమెపై దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన లక్ష్మీకుమారి జీజీహెచ్‌లో చేరి వైద్యం చేయించుకుంది. హేమతో తన ప్రాణానికి హాని ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం టౌన్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వహణ ఇంజినీర్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్ ఫీడర్‌లోని కొత్తపేట, చెంచుల కాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, ఆశ్రమం ఏరియా, హోటల్ పార్క్ ఎలైట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా సీతామాత జయంతి వేడుకలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి దేవస్థానం చిన కంచిలో శుక్రవారం సీతామాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఉదయం అమ్మవారికి అభిషేకార్చనలు చేశారు. అనంతరం పట్టుచీరతో అలంకారం చేసి బాలపూజలను నిర్వహించారు. నవమి కావడంతో ముత్తయిదువులు శ్రీచక్రార్చానికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలను జరిపి తీర్థప్రసాదములను భక్తులకు అందజేశారు.

24న పేరంటాలమ్మకు లక్ష పుష్పార్చన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 24న విశేష లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ శుక్రవారం తెలిపారు. భాను మాట్లాడుతూ వైశాఖమాసం సందర్భంగా ఆలయంలో 24వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మల్లెపూలతో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమం నిమిత్తం మల్లెపూలు ఇవ్వదలచిన భక్తులు 24న ఉదయం 10 గంటలలోపు ఆలయ కార్యాయలయంలో అందజేయాలని సూచించారు.

ఫలితాలపై జోరుగా పందేలు

- పెనమలూరు సీటుపై భారీగా బెట్టింగులు
- గెలుపోటములపై ఒకటికి రెండు అంటూ పందేలు
- మెజారిటీపైనా కడుతున్న పందెం



కంకిపాడు: ఉమ్మడి కృష్ణాజిల్లాలో సంపన్న నియోజకవర్గాల్లో పెనమలూరు కూడా ఒకటి. నిన్నటి వరకూ సార్వత్రిక ఎన్నికల హడావిడి, డబ్బుల పందేలు నడిచాయి. ఎన్నికలు పూర్తికావడంతో ప్రస్తుతం బెట్టింగుల జోరందుకుంది. పందెంరాయుళ్లు రంగంలోకి దిగి ఎంతకైనా పందెం రెడీ అంటున్నారు.

ఢీ అంటే ఢీ..

పెనమలూరు బరిలో వైఎస్సార్ సీపీ నుంచి జోగి రమేష్, టీడీపీ నుంచి కూటమిని తోడు తెచ్చుకుని బోడె ప్రసాద్ పోటీలో ఉన్నారు. వీరితో పాటుగా ఇంకా తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కన్నతల్లి లాంటి పార్టీని కాలదన్ని టీడీపీలోకి ఫిరాయించారు. దీంతో పెడన ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను పార్టీ అధిష్టానం పెనమలూరు అభ్యర్థిగా ఖరారు చేసింది. తనకంటూ సొంత వర్గం లేకపోయినా పార్టీ నేతలను సమన్వయం చేసుకుంటూ స్థానిక నేతలతో కలిసిపోయి పని చేశారు. అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టపరిచారు. ఇక్కడి ప్రజలతో మమేకమై సొంతవాడు అనిపించుకున్నారు. మరో వైపు అధిష్టానంపై ధిక్కార స్వరం వినిపించి, ఎన్ఆర్ఐల సహాయ సహకారాలు, సూట్‌కేసుల పుణ్యమాని సీటు తెచ్చుకున్న బోడె ప్రసాద్ బరిలో నిలిచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్‌పైనా, ఆయన కుటుంబం పైనా తీవ్ర పదజాలంతో దూషించి, వ్యక్తిగత దూషణకు పాల్పడటం తెలిసిందే. అయినా తలొగ్గకుండా జోగి రమేష్ సంక్షేమ పాలన అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల బరిలో ప్రత్యర్థులను ఢీకొట్టారు.

రూపాయికి రెండు అంటూ బెట్టింగ్‌లు..

ఎన్నికలు ముగియడంతో గెలుపు ఓటములపై ప్రస్తుతం బెట్టింగ్‌లు భారీగా జరుగుతున్నాయి. పెనమలూరులో కమ్మ, కాపు వర్గాల బలం, డబ్బులు పందేరం, అన్ని బలగాల ప్రయోగంతో తమదే విజయమని టీడీపీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుంది. సంక్షేమ అజెండా తమకు శ్రీరామరక్ష అని, ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకి, జగనన్నకు ఉందని ఆ పార్టీ భరోసాతో ఉంది. ఎన్నికల ముందు నుంచి టీడీపీ కూటమి నియోజకవర్గం వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ లక్ష్యంగా అల్లర్లు, దాడులకు తెగబడింది. కొందరు పోలింగ్ సిబ్బంది సహాయ సహకారాలతో దొంగ ఓట్లు కూడా వేసుకుంది. అడ్డుకోబోయిన వైఎస్సార్ సీపీ శ్రేణులపై పోలింగ్‌రోజు దాడులకు తెగించడం కూడా తెలిసిందే. ఇవన్నీ చూసుకుని టీడీపీ విర్రవీగుతోంది. గెలుపు ఓటములపై పందేలు కడుతోంది. రూపాయికి రెండు అంటూ విచ్చలవిడిగా బెట్టింగ్ జరుగుతోంది. ఎన్ఆర్ఐల సొమ్ముతో ఎన్నికలు అయ్యాక బెట్టింగులు కూడా మొదలెట్టారంటూ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. టీడీపీకి ఏ మాత్రం తగ్గేది లేదంటూ సామాన్య ప్రజానీకం తమ కష్టాన్ని బెట్టింగ్‌కు సిద్ధమంటూ 'తగ్గేదేలే' అంటూ ప్రతి సవాల్ చేస్తున్నారు.

మెజారిటీపైనా పందేలు..

గెలుపు, ఓటములతో పాటుగా మెజారిటీపైనా పందేలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో గ్రామాలు, మండలం వారీగా మెజారిటీపైనా పందేలు కడుతున్నారు. అంతే కాకుండా నియోజకవర్గం మెజారిటీ 'ఇన్ని వేలు' వస్తుందంటూ ఎవరికి వారు బెట్టింగ్ కడుతూ ఏ మాత్రం తగ్గడం లేదు. ఇప్పటికే బూత్‌లు, గ్రామాల వారీగా ఎవరికి ఎంత ఓటింగ్ వచ్చిందో సమీక్ష చేసుకోవడంతో ఆ మేరకు పందేలు కూడా ఊపందుకుంటున్నాయి.

టీడీపీ నేత ఆళ్ల తీరు హేయం

- కొత్త మల్లవల్లి పోలింగ్ కేంద్రం ఘటనపై వైఎస్సార్ సీపీ ధ్వజం
- మైనార్టీలను కులం పేరుతో దూషించడంతోనే వివాదం
- ఆళ్లపై దాడిని అడ్డుకునేందుకు యత్నిస్తే రాజకీయ విమర్శలా..?



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కొత్త మల్లవల్లిలో ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రంలోకి దౌర్జన్యంగా వెళ్లి అక్కడి అధికారులను, ఏజంట్లనే కాకుండా ఓ మైనార్టీ సామాజికవర్గాన్ని అగ్రకుల అహంకారంతో ఇష్టారాజ్యంగా దుర్భాషలాడిన టీడీపీ నేత ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తీరు అత్యంత హేయనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు దుయ్యబట్టారు. స్థానిక విజయవాడరోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం కొత్త మల్లవల్లి ఘటనపై పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ జానీషా, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవానీలు మీడియాతో మాట్లాడారు. కొత్త మల్లవల్లి పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన ఘటనకు వైఎస్సార్ సీపీతో ఎలాంటి సంబంధం లేదని, ఆళ్ల నోటి దురుసుతో అక్కడి మహిళలను రెచ్చగొట్టడంతో దాడి జరిగిందని చెప్పారు. ఎన్నికల అధికారులు, పోలీసులు ఈ వాస్తవాలను సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా తెలుసుకోవచ్చని అన్నారు. ప్రశాంతంగా ఉన్న కొత్త మల్లవల్లి గ్రామంలో ముస్లిం మైనార్టీల మధ్య వర్గ విభేదాలు సృషించే ప్రయత్నం టీడీపీ చేస్తోందని దుయ్యబట్టారు. కొత్త మల్లవల్లి పోలింగ్ కేంద్రంలో టీడీపీ నేత ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు హల్‌చల్ చేయడంతో పాటుగా కులం పేరుతో మైనార్టీలను దూషిస్తూ నోరు పారేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడిని అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నేతలపైనే తిరిగి పోలీస్ కేసులు పెట్టడం దారుణమన్నారు. పైగా టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు రోలర్లతో తొక్కిస్తామని, రెడ్ బుక్‌లో పేర్లు నమోదు చేశామని నోటికి వచ్చినట్లు మాట్లాడటంపై వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఎక్కడా హింసను ప్రోత్సహించలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ వలి, తలారి ఈశ్వరరావు, షేక్ అల్లాభక్షు పాల్గొన్నారు.

నాయకులకు నోటీసులు జారీ

పెనమలూరు: రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న రాజకీయ నేతలకు పోలీసులు శుక్రవారం రాత్రి నోటీసులు జారీ చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం టీడీపీ అభ్యర్థి బోడెప్రసాద్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి పాత్రికేయుల సమావేశంలో పరస్పరం రెచ్చ కొట్టే ప్రకటనలు చేయడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకుని ఇరు పక్షాల నేతలకు నోటీసులు జారీ చేశామన్నారు. ప్రశాంత వాతావరణం కోసం అందరూ సహకరించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రామారావు తెలిపారు.

స్థల వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు

ఉంగుటూరు: స్థలవివాద విషయంలో ఇరువర్గాలపై ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం మండలం దావాజీగూడెంకు చెందిన మొఘల్ షాజా, మొఘల్ బాజీ ఇరుకుటుంబాల వారు. వారి బంధువుల ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. వీరి మధ్య కొన్నేళ్లుగా స్థల వివాదం ఉంది. ఈ క్రమంలో స్థల వివాదం పరిష్కారం కోసం ఉంగుటూరు మండలం ఆత్కూరులో ఈ నెల 16వ తేదీ రాత్రి పంచాయితీకి ఇరువర్గాల వారు వెళ్లారు. మొఘల్ షాజా కుటుంబ సభ్యులకు పంచాయితీ ఇష్టం లేకపోవడంతో బయటకు వచ్చి వెళుతుండగా ఆత్కూరు సెంటర్లో బాజీ బంధువులు రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన షాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆసుపత్రి ఇంటిమేషన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అదేవిధంగా బాజీ కుటుంబ సభ్యులు కూడ తమను దాడి చేసి బెదిరించారని ఆత్కూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు ఎస్ఐ పైడి బాబు ఇరువర్గాలవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ

విజయవాడస్పోర్ట్స్: సీనియర్ పాత్రికేయులు, న్యూస్ క్లిక్ వెబ్‌సైట్ వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థ ఆత్మకథ 'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఈనెల 18వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఆవిష్కరిస్తున్నట్లు జర్నలిస్ట్ కె.లక్ష్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్ట్‌ను వెంటనే నిలుపుదల చేయాలని సుప్రీం కోర్టు ఈ నెల 15వ తేదీన తీర్పు ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సభలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, లా కళాశాల ప్రిన్సిపాల్ చెన్నుపాటి దివాకర్‌బాబు, నల్లూరి మాదవరావు, ప్రజాశక్తి బుక్ హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి, గోళ్ల నారాయణరావు పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, కామ్రేడ్ జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సేవా సమితి సంయుక్తంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

హింసకు పాల్పడితే నగర బహిష్కరణ

సీఐ రామారావు



వణుకూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు

పెనమలూరు: రాజకీయాల ముసుగులో హింసకు పాల్పడితే నగర బహిష్కరణ చేస్తామని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. ఈ మేరకు సీఐ రామారావు శుక్రవారం వివరాలు తెలుపుతూ ఎన్నికల అనంతరం చెలరేగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపడంతో పాటు నగర బహిష్కరణ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. కొందరు సంఘ విద్రోహ శక్తులు తమ వెంట ఉండే అమాయక యువత, కార్యకర్తలను రెచ్చగొట్టి హింసకు పాల్పడే విధంగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. దీని వల్ల కేసుల్లో ఇరుక్కుని జీవితం నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. స్థానిక నాయకులు వారి కేడర్ పట్ల బాధ్యతగా ఆలోచించాలని సూచించారు. నేతలు వారి తాత్కాలిక ప్రయోజనం కోసం యువతను బలిచేయరాదన్నారు. సోషల్ మీడియాలో కూడా అందరూ సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సమస్యలు సృష్టిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించమని సీఐ రామారావు తెలిపారు.

రాజకీయాలకు ప్రభావితం అవ్వకండి

పెనమలూరు: గ్రామాల్లో ప్రజలు రాజకీయాలపై ప్రభావితం కాకుండా ప్రశాంతంగా ఉండాలని పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు అన్నారు. పెదపులిపాక, వణుకూరు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగం ప్రకారం కేంద్ర ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికలు ఇటీవల నిర్వహించిందన్నారు. గ్రామాల ప్రజలను రాజకీయలపై ప్రభావితం చేయాలని స్వార్థ శక్తులు యత్నిస్తాయని వాటికి ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏసోబు, పోలీసు సిబ్బంది, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో నేల సారవంతం



ప్రొద్దుటూరులో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ కిరణ్

కంకిపాడు: పచ్చిరొట్ట పైర్ల సాగుతో నేల సారవంతంగా మారుతుందని మండల వ్యవసాయాధికారి పీఎం.కిరణ్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో పచ్చిరొట్ట విత్తనాలను శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ కిరణ్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం పెరగడంతో నేల సారం కోల్పోయి దిగుబడులు తగ్గిపోతున్నాయని అన్నారు. పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం ద్వారా భూమికి అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు. పచ్చిరొట్ట పైర్లు భూమిలో కలియదున్నడం వల్ల సేంద్రీయ పదార్థాలు, పోషకాలు వృద్ధి చెంది దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. 50 శాతం రాయితీపై జీలుగ, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 10 కిలోలు జీలుగ బస్తా పూర్తి ధర రూ. 880 కాగా 50 శాతం రాయితీపై రూ. 440కి అందిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లిపెసర 8 కిలోల బస్తా పూర్తి ధర రూ. 1,072 కాగా, 50 శాతం రాయితీపై రూ. 536కి అందిస్తున్నామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు రైతాంగానికి అందుబాటులో ఉన్నట్లు మండల ఏఓ ఎన్ఎల్.తేజశ్వి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జీలుగా 133 క్వింటాళ్లు, పిల్లి పెసర 30, జనుము 37 క్వింటాళ్లు రైతులకు సబ్సిడీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. జీలుగ కేజీ రూ. 44లు, జనుము రూ. 44లు, పిల్లిపెసర కేజీ రూ. 67.50లకు లభిస్తాయని చెప్పారు. పచ్చిరొట్ట సాగు చేసే రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి యాప్ ద్వారా తీసుకోవచ్చని వివరించారు.

కంకిపాడులో మోస్తరు వర్షం



పునాదిపాడు డొంకరోడ్డులో మొక్కజొన్న రాశి వేస్తున్న కూలీ

కంకిపాడు: వాతావరణ మార్పులతో కంకిపాడు మండలంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే చిరుజల్లులతో కూడిన వర్షం మొదలై మోస్తరు వానగా మారింది. సుమారు మూడు నుంచి నాలుగు గంటల పాటు నానుడు వర్షం కురవడంతో రహదారులు బురదమయంగా మారాయి. కంకిపాడు పట్టణంలోని రోడ్డు మార్జిన్‌లు, పల్లపు ప్రదేశాల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. దీనికి తోడు సుమారు గంటన్నరకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడి, మబ్బులు కమ్మేయడంతో ఎండ తీవ్రతతో అవస్థ పడిన ప్రజలు మబ్బులు, వానజల్లులతో ఊరట చెందుతున్నారు.

మొక్కజొన్న రైతుల ఉరుకులు పరుగులు..

మొక్కజొన్న రైతులు వర్షానికి ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఇటీవల వాతావరణం మబ్బులు కమ్మి అడపా దడపా జల్లులు, మోస్తరు వర్షం పడుతుండటంతో మొక్కజొన్న రైతాంగం కలవరపడుతోంది. ప్రస్తుతం పంట కోయించి, మిషన్ ఆడించి మొక్కజొన్నను కల్లాలు, రోడ్డు మార్జిన్‌లలో ఆరబోసుకున్నారు. పంట ఎండిన తర్వాత కోళ్లఫారాలు, వ్యాపారులకు విక్రయించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వర్షం పడటంతో పంటను సంరక్షించుకునేందుకు నానాఅవస్థ పడ్డారు. పంట వర్షం బారిన పడకుండా టార్పాలిన్‌లు, పరదాలు కప్పారు. మొక్కజొన్న రాశులుగా పోసుకుని పంట దెబ్బతిన్నకుండా కాపాడుకుంటున్నారు.

రేపు 'సృష్టిలో అమ్మ ప్రేమ'పై చిత్రలేఖనం పోటీలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సృష్టిలో అమ్మ ప్రేమ అంశంపై ఈ నెల 19వ తేదీ చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని ఫోరం ఫర్ ఆర్టిస్ట్ ప్రధాన కార్యదర్శి మ్యార్తి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు విజయవాడలోని విద్యాధరపురం బస్ డిపో పక్కన లేబర్ కాలనీ గ్రౌండ్‌లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం అదే రోజు ఆ వేదిక వద్దే బహుమతులను అందజేస్తామని తెలిపారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

డీఎల్‌పీఓ పి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ పి.శ్రీనివాసరావు

విజయవాడరూరల్: గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి పి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో విజయవాడ రూరల్ మండలంలోని గ్రామ సచివాలయాల గ్రేడ్-1, 2, 3, 4, 5 కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023-24వ సంవత్సరానికి సంబంధించి మండలంలో రూ. 13.62 కోట్ల ఇంటి పన్ను వసూలు కావాల్సి ఉండగా వాటిలో రూ. 9.73 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు వసూలైందని తెలిపారు. పాతబకాయిలు రూ. 4.77 కోట్లకు రూ. 2.58 కోట్లు వసూలు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత సంవత్సరానికి, పాతబకాయిలు కూడా ఇంటి పన్ను వసూలు వేగవంతం చేసి ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, నిడమానూరు, జక్కంపూడి గ్రామాల్లో ఇప్పటి వరకు 82 శాతం ఇంటి పన్ను వసూలు కాబడిందని, ఈ నెలాఖరులోపు నూటికి నూరు శాతం వసూలు చేయాలని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు సెంట్రల్ టీమ్ రాక..

నున్న, ప్రసాదంపాడు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు ఈనెలాఖరులోపు సెంట్రల్ టీమ్ రానుందని వర్షాలు కురుస్తున్నందున పారిశుద్ధ్య పనులు ప్రతి రోజూ మెరుగు పర్చాలన్నారు. సచివాలయాల పనితీరును పర్యవేక్షించేందుకు సెంట్రల్ టీమ్ 30వ తేదీన గొల్లపూడి రానుందని తెలిపారు. గ్రేడ్-5 కార్యదర్శులకు డ్రాయింగ్ పవర్ కల్పించినప్పటికి ట్రెజరరీల్లో ఆ విధమైన ఆదేశాలు తమకు అందలేదని చెబుతున్నారని కార్యదర్శులు సమావేశంలో ప్రస్తావించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డీఎల్‌పీఓ తెలియజేశారు. సమావేశంలో ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

చురుగ్గా కర్మల భవనం నిర్మాణ పనులు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ప్రజల సహకారంతో కర్మల భవనం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో ప్రజలకు అనువుగా ఉండే ప్రదేశంలో భవనం నిర్మిస్తున్నారు. కర్మకాండలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా భవనాన్ని గ్రామస్తులు ఐక్యతతో నిర్మిస్తున్నారు. పిండప్రదానం, తలనీలాలు తొలగించే లాంటి కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు వీలుగా భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి భవన సదుపాయం లేకపోవడంతో చెరువు కట్టపై కర్మకాండలు నిర్వహించుకునేవారు. ప్రస్తుతం భవనం శ్లాబు నిర్మాణం వరకు పనులు పూర్తి చేశారు.

నేత్రపర్వం.. పాండురంగడి పుష్పయాగం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలోని రుక్మాబాయి సమేత పాండురంగ, సంతాన వేణుగోపాల స్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారి పుష్పయాగం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం ద్వాదశ వార్షికోత్సవం పురస్కరించుకొని స్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం రుక్మాబాయి సమేత పాండురంగడి ఉత్సవమూర్తులకు తిరుమంజనం చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం చేశారు. సుమారు రెండు గంటల పాటు భక్తుల నామస్మరణలు, మంగళవాయిద్యాలు, అర్చకస్వాములు మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి పుష్పయాగం రమణీయంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమాలను అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు నిర్వహించారు.

రక్తపోటుపై అవగాహన ఉండాలి

డాక్టర్ శౌరిబాల

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడ రైల్వే హాస్పటల్‌లోని న్యూ ఓపీడీ భవనంలో రక్తపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల రక్తపోటుపై రోగులకు అవగాహన కల్పించారు. రైల్వే ఉద్యోగులు విధుల్లో చురుగ్గాను, ఒత్తిడి లేకుండా ఉండటానికి వారి వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై వైద్య బృందాన్ని ఆమె అభినందించారు. రమేష్ హాస్పటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ టి.రామ్‌మోహన్ రక్తపోటు కారణాలు, లక్షణాలు, చికిత్స, నివారణ తదితర అంశాలపై ఆడియో, వీడియో ప్రదర్శన ద్వారా రోగులకు అవగాహన కల్పించారు. రక్తపోటు నివారణకు సరైన ఆహార నియమాలు, జీవన శైలిమార్పులు, ధ్యానం, యోగా ఉత్తమ మార్గాలన్నారు.

అనంతరం నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో రోగులకు రక్తపోటు, ఈసీజీ, ర్యాండమ్ బ్లడ్ షుగర్, మూత్రపిండాల పనితీరు తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ ప్రదీప్ డాక్టర్ నజీర్‌హుసేన్, భవానీ హాస్పటల్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.